క్లుప్తంగా

నట్టల నివారణతో జీవాలు ఆరోగ్యం



ఫిరంగిపురం: నట్టల నివారణ మందు తాగించడం ద్వారా జీవాలు ఆరోగ్యంగా ఉంటాయని పశువైద్యాధికారి షేక్.పీర్ అహ్మద్ అన్నారు. మండలంలోని నుదురుపాడు పశువైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ.. జీవాల పెంపకం దారులు తమ గొర్రెలు, మేకలకు ఉచితంగా అందజేసే నట్టల నివారణ మందు తప్పనిసరిగా అందించాలని చెప్పారు. దీని ద్వారా జీవాల పేగుల్లో ఉన్న పురుగులు నశించి ఆరోగ్యంగా ఉంటాయన్నారు. అనంతరం 250 గొర్రెలు, 50 మేకలకు నట్టల నివారణ మందు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో జిల్లా కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో సోమవారం సంఘం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సంఘనాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన టి.గౌతమ్ ఇంటర్ చదివేందుకు తగిన ఆర్థికసాయం అందజేయాలని కోరడంతో సంఘసభ్యులు స్పందించి రూ.25 వేలు సాయంగా అందజేశారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వెంకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.భాస్కరశ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఇ.శివన్నారాయణ, ఉపాధ్యక్షుడు ఎ.అంకమ్మరావు, సహాయ కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు, కె.అనిల్, కె.పద్మారావు, ఎం.సుబ్బారావు, వై.పూర్ణచంద్రరావు, ఆర్.సురేష్, బి.బ్రహ్మయ్య, ఎ.సాంబయ్య, ఆర్.సుబ్బారావు, జి.వెంకటేశ్వర్లు, ఎం.వెంకటరత్నం, ఆర్.శివకోటేశ్వరరావు, కాశయ్య, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయురాలికి సన్మానం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధి కళ్లం అంజిరెడ్డి జిల్లా పరిషత్ పాఠశాలలోని ఉపాధ్యాయురాలు సోమవారం ఉద్యోగ విరమణ చేయడంతో తోటి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి మాట్లాడుతూ.. డి.ఎల్. స్వరూపారాణి తమతో పాటు ఇక్కడే బయాలజీ ఉపాధ్యాయినిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని, విద్యార్థులతో కలిసి మెలిసి ఉంటూ వారికి పాఠాలు బోధించారని అన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని పాఠశాల అభివృద్ధికి మనందరం కృషిచేయాలని తెలిపారు. అనంతరం స్వరూపారాణి దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

నాణ్యమైన విత్తనాలు వినియోగించుకోవాలి

దుగ్గిరాల: మంచి విత్తనాలు సారవంతమైన నేలలో విత్తితే అధిక పంట వస్తుందని దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల గ్రామాల రైతులు ఖరీఫ్ సీజన్‌లో సబ్సిడీపై రైతుసేవా కేంద్రాల వద్ద తమ ఆధార్ కార్డు చూపించి నాణ్యమైన, మేలిమి లక్షణాలు కలిగిన వరి రకం బీపీటీ-5204 వంగడాలను తీసుకోవాలని కోరారు. రైతులు కల్తీ విత్తనాలతో మోసపోకుండా లేబుల్, సరైన ప్యాకింగ్, క్వాలిటీ పరిశీలించి.. విత్తనాలను గమనించి తీసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో సూచించారు.

అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలి

దుగ్గిరాల: కూటమి ప్రభుత్వం రైతులకు ఖరీఫ్ సాగు మొదలవుతున్న నేపథ్యంలో అన్నదాత సుఖీభవ పథకం వెంటనే అమలు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శంకరరావు అన్నారు. సోమవారం దుగ్గిరాలలోని రైతు సంఘం కార్యాలయంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశం ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు యోగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న శంకరరావు మాట్లాడుతూ.. ఎన్నికల హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అమ్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి యువ విభాగాలే బలం



నాయకులకు సూచనలిస్తున్న మంగళగిరి సమన్వయకర్త వేమారెడ్డి



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రచార విభాగం అధ్యక్షులు కాకుమాను రాజశేఖర్‌ను సన్మానిస్తున్న రాజేంద్ర

మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: వైఎస్సార్ సీపీ విజయంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని.. వారందరినీ గుర్తించుకుని పార్టీ వారికి అవకాశం ఇస్తుందని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి తెలిపారు. ఆత్మకూరులోని నియోజకవర్గ కార్యాలయంలో యువజన విభాగాల నాయకులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో యువకులు పాత్ర కీలకమన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత యువకులపై ఉందని తెలిపారు. రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి మ్యానిఫెస్టోను వివరించి హామీలను విస్మరించిన చంద్రబాబు గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకురాతి రాజేష్, అమరా నాగయ్య, నాలి వెంకటకృష్ణ, దర్శి రమేష్, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులకు సన్మానం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులను నూతనంగా వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బేతపూడి రాజేంద్రకుమార్ సోమవారం ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజేంద్రను వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఆ పదవిని ఎంతో నమ్మకంగా తమకు ఇవ్వడంపై మాజీ ప్రభుత్వ సలహాదారులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రచార విభాగం అధ్యక్షులు కాకుమాను రాజశేఖర్‌లను ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆర్‌టీఐ ఎన్‌టీఆర్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి సౌమ్య, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శేషగిరి, మందడం గ్రామ పార్టీ అధ్యక్షులు ఆలూరి శ్రీనివాస్, ప్రాతూరి జగదీష్, ఆరేపల్లి జోజి, నూతక్కి జోషి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యపై ప్రభుత్వం స్పందించాలి



కార్మికులకు సంఘీభావం తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, వైఎస్సార్‌టీయూ నాయకులు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 209 రోజులుగా కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం దీక్షలు చేస్తున్నా కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని అన్నారు. యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ.. ఈ వారం హైకోర్టులో కార్మికులకు చెందిన రెండు కేసులలో ఒకటి తుది దశలో ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, సూర్యప్రకాశరావు, ఇస్మాయిల్, బాషా, కార్మికులు అన్నమ్మ, విజయశ్రీ, సారమ్మ, రమాదేవి, రిబ్కా తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం చెప్పింది వింటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న స్మార్ట్ మీటర్లు వద్దంటూ సీపీఎం ముద్రించిన కరపత్రాలను నాయకులు సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని రామయ్య కాలనీలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లతో రానున్న రోజుల్లో పేద ప్రజలకు మరిన్ని విద్యుత్ భారాలు పడే ప్రమాదం ఉందని వివరించారు. గత ఎన్నికల సందర్భంగా నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలకొట్టమని చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు వేముల వెంకటేశ్వరరావు, ఎం.మల్లేశ్వరి, రమణ, ప్రసాద్, నాగవేణి, లక్ష్మి, హసీనా, చల్లా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయ ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ డి.ఇ. సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పట్టణ పరిధిలోని గండాలయ్యపేట, కొత్తపేట, ఆర్‌అండ్‌బీ బంగ్లా రోడ్, హాస్పటల్ రోడ్, మెయిన్ బజార్, ఎయిమ్స్ గేట్, ఎకో పార్క్ ప్రాంతాల్లో విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు ప్రజా దర్బార్

తాడేపల్లి రూరల్: రాష్ట్ర, మంగళగిరి నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి నారా లోకేష్ ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ మంగళవారం జరగనున్నదని ఆయన కార్యాలయం నుంచి సోమవారం ఒక ప్రకటన వెలువడింది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నామని.. 7 గంటల లోపు వచ్చిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సమ్మెకు సహకరించాలని నోటీసు అందజేత



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

తాడేపల్లి రూరల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఈనెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు సహకరించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు కోరారు. తాడేపల్లిలోని టీటీడీ రైల్వే యార్డ్ ముఠా కాంట్రాక్టర్ రవిచంద్ర, మేనేజర్ సురేందర్ రెడ్డిలను కలిసి నాయకులు సోమవారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ.. 9వ తేదీన ట్రేడ్ యూనియన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు ముఠా కార్మికులు తప్పని సరిగా హాజరు కావాలని.. కావున ఆ రోజు కార్మికులు విధులకు హాజరు కారని వినతిపత్రం అందజేశామని తెలిపారు. ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో టీటీడీ ముఠా కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, టి.వెంకటయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య పిలుపునిచ్చారు. మంగళగిరి పట్టణ పరిధిలోని లక్ష్మీ నరసింహ స్వామి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ నూతన సెక్టార్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగే సమ్మెలో అంగన్‌వాడీలు అధిక సంఖ్యలో పాల్గొన్ని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఆరుగురితో కూడిన నూతన సెక్టార్ కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ తదితర నాయకులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థుల ప్రతిభ



ప్రథమ బహుమతి అందుకుంటున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లి రూరల్: ఏపీ పోలీస్ 4 సైట్స్ ఎ హాక్‌థాన్ 2025లో వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించినట్లు మల్టీ డిసిప్లినరీ డిపార్ట్‌మెంట్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూషిప్ విభాగం (ఎండీఐ అండ్ ఈ) డైరెక్టర్ డాక్టర్ నరసింహరాజు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండీఐ అండ్ ఈ విభాగం, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇంకుబేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూషిప్ (సీఐఐఈ) విభాగా ఆధ్వర్యంలో ఏఐ డీఎస్ హానర్స్ బీటెక్ ద్వితీయ సంవత్సరం ఇన్నోవేషన్ కోర్సు అభ్యసిస్తున్న వేదానంద ప్రణీల్ తన బృందంతో కలిసి ఈ పోటీలలో పాల్గొని విజేతగా నిలిచారని తెలిపారు. ఈ పోటీలలో సుమారు 150కి పైగా బృందాలు పాల్గొనగా 60 బృందాలు తుది జాబితాలోకి ఎంపికయ్యాయని వివరించారు. విజేత బృందం పరిష్కరించిన సవాల్ గురించి వివరిస్తూ వాట్సప్ చాట్స్, గ్రూప్ డేటా ఆధారంగా కీలక అంశాలు, ముందస్తు హెచ్చరికలు గుర్తించే ఏఐ టూల్‌ను అభివృద్ధి పరిచారని అన్నారు. కేఎల్‌యూ విద్యార్థుల సాంకేతిక నైపుణ్యం, ఆవిష్కరణాత్మక ఆలోచనకు ఇది నిదర్శమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, ఆచార్యలు తదితరులు వేదానంద ప్రణీల్ బృందానికి అభినందనలు తెలిపారు.

ముమ్మరంగా నకిలీ బంగారం కేసు విచారణ

- ఇప్పటికే ఇద్దరు అరెస్ట్
- రికవరీకి నోచుకోని సొమ్ము

తాడేపల్లి రూరల్: రూ.9.20 కోట్ల నకిలీ బంగారం తాకట్టు పెట్టి బ్యాంకును మోసం చేసిన కేసును పోలీసులు ముమ్మరంగా విచారణ చేపట్టారు. మంగళగిరిలోని కరూర్ వైశ్యాబ్యాంక్‌లో నకిలీ బంగారం తాకట్టు పెట్టారంటూ మేనేజర్ మే మొదటి వారంలో ఫిర్యాదు చేశారు. మే 25వ తేదీన మంగళగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. బ్యాంకులో అప్రైజర్‌గా విధులు నిర్వహించిన చుండూరు మదన్‌కుమార్, రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయకుండా, డబ్బులు రికవరీ చేయకుండా వారిద్దరినీ కోర్టుకు హాజరుపరిచి చేతులు దులుపుకొన్నారు. ఈ కేసులో మరో కీలక వ్యక్తి అయిన టేకీ ప్రసాద్‌ను కూడా మంగళగిరి పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకుని రహస్య స్థలంలో విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రసాద్, రాజశేఖరరెడ్డి బ్యాంక్ మేనేజర్‌ను, అప్రైజర్‌ను, బ్యాంకులో పనిచేస్తున్న మరికొంత సిబ్బందిని మభ్యపెట్టి చదువులేని సాధారణ తాపీ కూలీలుగా పనిచేస్తున్న నులకపేట, మంగళగిరిలోని పలువురు కూలీలకు రూ.1000, రూ.2000 ఆశ చూపించి బ్యాంకులో ఖాతాలు తెరిపించారు. చెక్కు బుక్‌లు తీసుకుని ఖాతాదారులకు ఇవ్వకుండా వారి వద్ద ఉంచుకుని ప్రసాద్ బ్యాంకులో చక్రం తిప్పి కృష్ణాజిల్లా మచిలీపట్నం నుంచి బంగారపు పూత పూసిన నకిలీ బంగారాన్ని విడతల వారీగా తీసుకువచ్చి మంగళగిరిలోని కరూర్ వైశ్యాబ్యాంక్ శాఖలో పెట్టి రుణాలు తీసుకున్నారు. బ్యాంక్ మేనేజర్ బదిలీ అయ్యి కొత్త మేనేజర్ రావడంతో గుట్టు బయటకు వచ్చింది. విచారణలో మొత్తం రూ.9.20 కోట్లకు గాను ఇప్పటికీ రూపాయి కూడా రికవరీ కాకపోవడం గమనార్హం.

ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి

మంగళగిరి టౌన్: ఎంటీఎంసీ పరిధిలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో అర్ధనగ్నంగా ప్లేట్లు పట్టుకుని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు 17 రోజుల పాటు మున్సిపల్ కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేయడంతో ఆనాటి ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని కోరుతున్నామన్నారు. ఇంజనీరింగ్ పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నామన్నారు. 4వ తేదీన విజయవాడలో జరిగే ఆందోళన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరు కావాలని కోరారు. 9వ జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, సీపీఎం పట్టణ కార్యదర్శి వీవీ జవహర్ లాల్, ఆర్టీసీ యూనియన్ నాయకులు కె.పాములు, సీఐటీయూ మండల రూరల్ నాయకులు యు.దుర్గారావు, అభ్యుదయవాది ఆర్.సాంబశివరావు, యూనియన్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, టి.కేదార్‌నాథ్, ప్రకాష్, కె.దుర్గారావు, పి.రాము తదితరులు పాల్గొన్నారు.



అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

డాక్టర్స్ డే వేడుకలు నేడు



మాట్లాడుతున్న వీవీ ప్రసాద్

మంగళగిరి టౌన్: జూలై 1వ తేదీన డాక్టర్స్ డే సందర్భంగా మంగళగిరి పట్టణంలో ప్రజా ఆరోగ్యవేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ప్రభుత్వ డాక్టర్లకు మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రజా ఆరోగ్య వేదిక మంగళగిరి రీజియన్ కన్వీనర్ వీవీ ప్రసాద్ తెలిపారు. మంగళగిరి నిర్మల జూనియర్ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులందరికీ, 100 పడకల ఆసుపత్రి సాధన కమిటీ సభ్యులకు కూడా సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి సాధన కమిటీ 15 ఏళ్లుగా పోరాటం చేసి సాధించిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ పోరాటంలో ఉన్న ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ కేవీఎస్ సాయి ప్రసాద్, డాక్టర్ వంశీకృష్ణలతో పాటు సాధన కమిటీ సభ్యులందరికీ సన్మానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమం సాయంత్రం 4 గంటలకు పట్టణ పరిధిలోని వైష్ణవి కల్యాణ మండపంలో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు ఎస్.బాలకృష్ణ, నాయకులు ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లంక భూములకు పట్టాలు ఇవ్వాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

దుగ్గిరాల: పెదకొండూరు, గొడవర్రు గ్రామాల లంక భూములను సాగు చేస్తున్న రైతులకు పట్టాలు, పాసు పుస్తకాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా సోమవారం కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా సాగుచేస్తున్న లంక భూములకు ప్రభుత్వం రైతులకు పట్టాలు ఇవ్వకపోవడంతో రైతులు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, బీమాలు, పంట పెట్టుబడి సాయాలు అందకోలేకపోతున్నారని తెలిపారు. దీనిపై సచివాలయ సెక్రెటరీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కౌలు రైతు నాయకులు మన్నవ నాగమల్లేశ్వర రావు, దాసరి విజయలక్ష్మి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.